భద్రత పెంచాలి



ఆస్పత్రుల్లో పని చేసే మహిళా వైద్య సిబ్బందికి భద్రత పెంచాలి. కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలి. నిందితులను కఠినంగా శిక్షించాలి. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్య సిబ్బంది రక్షణపై దృష్టి సారించాలి. రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తేవాలి.

-కమల, స్టాఫ్ నర్స్, యూపీహెచ్‌సీ, కమలాపురం

సీసీ కెమెరాలు అమర్చాలి



రోజు రోజుకు వైద్య సిబ్బందిపై దాడులు పెరిగిపోతున్నాయి. కోల్‌కతా ఘటన మరువక ముందే తిరుపతి స్విమ్స్‌లో మహిళా వైద్యురాలిపై రోగి దాడి చేయడం దారుణం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా నైట్ డ్యూటీలు చేసే వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీసీ కెమరాతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి.

-సుజిత, ఫార్మసిస్ట్, యూపీహెచ్‌సీ, కమలాపురం



వైద్యులకు భరోసా కల్పించాలి



రోగులకు మెరుగైన సేవలందించే డాక్టర్లకు రక్షణ కల్పించాలి. వైద్యులు భయంతో విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఉండకూడదు. వైద్యులపై దాడి చేయాలన్నా, అమానవీయంగా వ్యవహరించాలన్నా భయమేయాలి. కఠినమైన చట్టాలు చేస్తేనే వైద్యులు, వైద్య సిబ్బంది ప్రశాంతంగా పని చేయగలుగుతారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

- డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, వైద్యాధికారి, యర్రగుంట్ల అర్బన్ హెల్త్ కేంద్రం, యర్రగుంట్ల

ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి



విధుల్లో ఉండే మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందికి పూర్తి స్థాయి భద్రత కల్పించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచాలి. రాత్రి సమయంలో డ్యూటీ చేసే మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందికి రక్షణగా పోలీసులతో గస్తీ నిర్వహించాలి. ఆస్పత్రి వద్ద పగలు, రాత్రి సమయంలో వాచ్‌మెన్‌లు ఏర్పాటు చేయాలి.

- డాక్టర్ ప్రియాంక, వైద్యాధికారి, యర్రగుంట్ల పీహెచ్‌సీ, యర్రగుంట్ల

క్లుప్తంగా

ఆధునిక టెక్నాలజీపై అవగాహన

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో యూనివర్సిటీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం అప్లికేషన్స్ ఆఫ్ జియో స్పార్టికల్ ఆధునిక టెక్నాలజీ అనే అంశంపై డా.సునందన్‌రెడ్డి, అసోషియేట్ ప్రొఫెసర్ ఆర్జీఎం కాలేజ్ నంద్యాల ఆధ్వర్యంలో వన్‌డే ఆన్‌లైన్ నేషనల్ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అరుణక్రాంతి మాట్లాడుతూ రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ ఆవశ్యకతపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, సివిల్ విభాగాధిపతి సూర్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

పులివెందుల రూరల్ : పేదరిక నిర్మూలనే లక్ష్యమని డీఆర్డీఏ ఏపీఎం గురురాజు అన్నారు. బుధవారం డీఆర్డీఏ కార్యాలయంలో మండల మహిళా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల్లోని సంఘ సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఆర్థిక ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న గృహహింస, హింసాత్మక ఘటనలను సామూహికంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం మండల సమైఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎస్ఆర్‌పల్లి శ్రీలత, కార్యదర్శిగా జయమ్మ, కోశాధికారిగా సుశీలమ్మ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఊరేగింపులో ఉద్రిక్తత



ఇరువర్గాలతో చర్చలు జరుపుతున్న అడిషనల్ ఎస్పీ వెంకట రాముడు

చెన్నూరు (వల్లూరు): మండల కేంద్రమైన చెన్నూరు ట్రంకు రోడ్డులో వెలసిన లలితాంబికా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఉత్సవ మూర్తుల ఊరేగింపు కార్యక్రమాన్ని ఓ మతం వారు వ్యతిరేకించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సీఐ పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా అడిషనల్ ఎస్పీ వెంకట రాముడు భారీ పోలీసు బలగాలతో చెన్నూరుకు చేరుకొని.. ఇరు వర్గాలతో చర్చలు జరిపారు. గురువారం జరగనున్న ధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ హెచ్చరించారు.

వాటర్ కూలర్ వితరణ

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల జిల్లా పరిషత్ పాఠశాలకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ జమ్మలమడుగు శాఖ ఆధ్వర్యంలో వాటర్ కూలర్ వితరణ చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ సోమశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులందరూ వాటర్ కూలర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ అమర్‌నాథ్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న నేషనల్ మజ్దూర్ నాయకులు

జమ్మలమడుగు : ఏపీఎస్ఆర్టీసీ కడప రీజనల్ పరిధిలో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ పిలుపు మేరకు ఆర్టీసీ డిపో గ్యారేజీలో రెండో రోజు ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి శివుడు, అధ్యక్షుడు బ్రహ్మం మాట్లాడుతూ 1/2019 సర్క్యూలర్ అమలు చేయాలని, మహిళలకు చైల్డ్ కేర్ లీవ్ మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులకు వేధిస్తున్న జమ్మలమడుగు డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ సమావేశం వాయిదా

జమ్మలమడుగు: జమ్మలమడుగు మున్సిపల్ సమావేశం కోరం లేక వాయిదా పడింది. బుధవారం ఉదయం 11గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహించాల్సి ఉండగా.. వైఎస్సార్‌సీపీకి చెందిన కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ ప్రకటించారు.

ఉల్లి రైతు ఉసూరు

- మందులు పిచికారీ చేసిన అదుపులోకి రాని తెగుళ్లు
- దిగుబడులపై తీవ్ర ప్రభావం
- ఆందోళనలో ఉల్లి రైతులు



వేముల వద్ద తెల్ల తెగులుతో దెబ్బతింటున్న ఉల్లిపంట

వేముల : ఉద్యానవన పంటల్లో అతిసున్నితమైన పంట ఉల్లి. పంటల్లో రైతులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా తెగులు వీడడం లేదు. ముందు జాగ్రత్తగా పంటను కాపాడుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు. ఈ ఏడు ఉల్లిపంటకు విపరీతమైన తెగుళ్లు సోకాయి. ఉల్లి మొలకెత్తినప్పటి నుంచి మందులు పిచికారీ చేస్తున్న తెగుళ్లు ఆశిస్తూనే ఉన్నాయి. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తున్నా తెగుళ్ల మాత్రం పంటను వదలడం లేదు. తెగుళ్లతో ఉల్లిపంటపై ఆశపెట్టుకున్న రైతులకు నిరాశే మిగులుతోంది.

అన్నదాత సతమతం

నియోజకవర్గ వ్యాప్తంగా 5 వేల ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. వేముల మండలంలోనే 2వేల ఎకరాలకు పైనే ఉల్లి సాగయింది. ఉల్లికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందనే ముందస్తు సమాచారంతో రైతులు సాగు చేశారు. ఇప్పటివరకు తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకుంటూ వచ్చారు. సకాలంలో నీటితడులు, మందులను పిచికారీ చేస్తూ వచ్చారు. పంట కాలం నాలుగు నెలలు. సాగు చేసి మూడు నెలలు కావస్తోంది. ఈ దశలో పంటకు తెగుళ్ల సోకడంతో రైతులు సతమతమవుతున్నారు.

అదుపులోకి రాని తెగుళ్లు

ఉల్లిపంటలో తెగుళ్ల అదుపులోకి రావడం లేదు. ఇప్పటికే అనేక సార్లు పిచికారీ చేశారు. వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా తెగుళ్ల అదుపులోకి రావడం లేదని రైతులు వాపోతున్నారు. తెగుళ్ల అదుపులోకి రాకుంటే నష్టాలను చవిచూడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. వేసవిని తలపిస్తున్న ఎండలు, వర్షాలు లేక పంటలపై తెగుళ్ల విజృంభిస్తున్నాయని కర్షకులు చెబుతున్నారు.

దిగుబడులపై ప్రభావం

ఉల్లిపంటకు సోకిన తెగుళ్ల దిగుబడులపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయి. ప్రస్తుతం పంట గడ్డ దశలో ఉంది. తెగులు సోకడం వలన పంట ఎదుగుదల లేక గడ్డలు ఊరే పరిస్థితి కనపడడం లేదు. ఎకరాకు 80 నుంచి 100 క్వింటాళ్ల దిగుబడులు వచ్చేదని, తెగులు సోకడంతో ఎకరాకు 50 క్వింటాళ్లు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

మూడు ఎకరాల్లో ఉల్లి సాగు చేశా



నాకున్న మూడు ఎకరాల్లో ఉల్లి సాగుచేశాను. సాగులో రూ.లక్షకు పైనే పెట్టుబడులు పెట్టా. ఇప్పటివరకు పంటను కాపాడుకున్నా. తెల్లతెగులు సోకడంతో పంట దెబ్బతింటోంది. మందులు పిచికారీ చేసినా నివారించలేకపోతున్నాం. తెగులుతో పంటలో దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉంది.

- అంకిరెడ్డి, ఉల్లిరైతు, గొందిపలె

దిగుబడులపై తీవ్ర ప్రభావం



ఉల్లికి సోకిన తెల్ల తెగులు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తెగులు నివారణకు మందులు కొట్టినా ఫలితం లేకుండా పోతోంది. గడ్డలు ఊరే సమయంలో ఈ తెగులు సోకడం వల్ల ఉల్లి గడ్డలు ఊరే పరిస్థితి లేకుండా పోతోంది. తెగులుతో సాగులో దిగుబడులు పూర్తిగా తగ్గిపోతాయి. సాగులో పెట్టిన పెట్టుబడులకు కూడా గిట్టుబాటు రాక తీవ్రంగా నష్టపోతాం.

-గంగిరెడ్డి, ఉల్లి రైతు, నారేపల్లె

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణలు

వేముల : మండలంలోని గొందిపల్లె పంచాయితీ పరిధిలోని రంగోరిపల్లె గ్రామంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో రూ.30 లక్షలతో నూతనంగా రామాలయాన్ని నిర్మించారు. 26న గణపతి పూజతో ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ట వేడుకలు 28వ తేదీ ధ్వజ శిఖర శ్రీ సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠతో ముగిశాయి. అనంతరం సీతారాముల కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకట బయపురెడ్డి విగ్రహ ప్రతిష్టలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ముద్దనూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట, సీతారాముల కల్యాణాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరుణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రామిరెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని దినేష్ మెడికల్ సెంటర్ (ఇసీ గంగిరెడ్డి ఆస్పత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిటి మిషన్లు అమర్చడం, ముక్కు దూలం సరిచేయడం, అలర్జీ, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స చేస్తారని పేర్కొన్నారు. అలాగే మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య మధ్యాహ్నం 12గంటల నుంచి 4గంటల వరకు సోరియాసిస్, తామర, గజ్జి, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, సలిపిరి, సభ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, పులిపిర్లు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రతి ప్రాణికి కంటి చూపు అవసరం



ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి

పులివెందుల టౌన్ : ప్రతి ప్రాణికి కంటిచూపు ఎంతో అవసరమని, కంటి చూపును పదికాలాల పాటు సంరక్షించుకుని మెరుగుపరచుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తొండూరు మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి అన్నారు. బుధవారం స్థానిక భాకరాపురంలో అన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఎస్ఆర్‌ఐ కంభం తిరుమల రెడ్డి కుటుంబం, శంకర్ నేత్రాలయ చెన్నై సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్పొరేట్ స్థాయి ఉచిత కంటి పరీక్ష, కంటి ఆపరేషన్ల క్యాంపును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్యాంపు సెప్టెంబర్ 5వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. పులివెందుల నియోజకవర్గ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ కార్పొరేట్ స్థాయి వైద్యం, శస్త్ర చికిత్సలు ప్రజలకు ఉచితంగా నిర్వహించడం చాలా గొప్పవిషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నప్ప, రసూల్, హఫీజ్, పార్నపల్లి కిశోర్, రవి, పద్మనాభరెడ్డి, చంద్రమౌళి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగాల కుడికాలువకు నీరు విడుదల



లింగాల కుడికాలువలో ప్రవహిస్తున్న సీబీఆర్ జలాలు

లింగాల : లింగాల కుడికాలువకు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి మంగళవారం సాయంత్రం నీటిని విడుదల చేశామని సీబీఆర్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. రోజుకు 100 క్యూసెక్కుల చొప్పున కుడికాలువకు నీరు విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. కుడి కాలువపై ఉన్న ఎత్తిపోతల పథకాల నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో చెరువులకు, కుంటలకు నీటిని విడుదల చేస్తామన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో రైతులు సాగు చేసిన పంటలను కాపాడేందుకు మండలంలోని వెలిదండ్ల, తాతిరెడ్డిపల్లె, కోమన్నూతల, ఎగువపల్లె, మురారిచింతల, లింగాల, ఇప్పట్ల, తదితర గ్రామాల్లోని చెరువులకు, కుంటలకు ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని విడుదల చేశామని చెప్పారు.

పంట నమోదు తప్పనిసరి



ఈ పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి నాగలక్ష్మి

పులివెందుల రూరల్ : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు తాము పండించే పంటల వివరాలను ఇ-క్రాప్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని పులివెందుల మండల వ్యవసాయ అధికారిణి నాగలక్ష్మి సూచించారు. బుధవారం పులివెందుల మండల పరిధిలోని యర్రబల్లి-1 రైతు సేవా కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం సాగుచేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇ-క్రాప్ నమోదు వల్ల రైతులకు వ్యవసాయ పంట నష్ట పరిహారం, వ్యవసాయ రుణాలు పొందడంతో పాటు తాము పండించే పంటను అమ్ముకోవడానికి వెసులుబాటు ఉంటుందన్నారు. మండల వ్యాప్తంగా 5,500 ఎకరాలు ఈ పంట నమోదు చేయడం పూర్తి అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి.

లింగాల : లింగాల మండలం అంబకపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు బండి శ్రీనివాసులరెడ్డి, ఎంపీ వ్యక్తిగత కార్యదర్శి సోదరుడు బండి త్రివేంద్రరెడ్డి వివాహం స్థానిక మండల పరిధిలోని నూతికోన సిద్దలింగేశ్వర స్వామి సన్నిధిలో జరిగింది. ఈ వివాహానికి పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబురెడ్డి, ప్రధాన కార్యదర్శి రసూల్, చిన్నప్ప, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లి కిశోర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

పత్తి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి

వీరపునాయునిపల్లె : ప్రస్తుతం పత్తిపంటలో గులాబీ రంగు పురుగు నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఉరుటూరు గ్రామంలో పత్తి పంటను మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబుతో కలసి పరిశీలించి రైతులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ రసం పీల్చే పురుగులు, గులాబీ రంగు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. పచ్చ దోమ, తెల్ల దోమ, తామర పరుగుల నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలన్నారు. పసుపు పచ్చని జిగురు పల్లాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పత్తి పంటలో బోరాన్, మెగ్నీషియం లోపాలు అధికంగా ఉన్నట్లు గుర్తించామని, పంట సాగు చేసిన 60 రోజుల తరువాత లీటరు నీటికి 1-15గ్రాములు బోరాక్స్ వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

90 మద్యం బాటిళ్లు స్వాధీనం

పెద్దముడియం : అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని దిగువ కల్వటాల గ్రామంలో బాల గంగన్న అనే వ్యక్తి మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం రావడంతో అతని ఇంటిపై దాడి చేసి 90 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

రెండు లారీలు ఢీ.. ఇద్దరి గాయాలు

కొండాపురం : మండల పరిధిలోని పెంజి అనంతపురం సర్కిల్ సమీపంలో ఎదురుఎదురుగా వస్తున్నా రెండు లారీలు ఢీ కొన్న ఘటనలో ఇద్దరు గాయపడినట్లు బుధవారం రాత్రి స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. క్షతగాత్రులను ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తులుగా గుర్తించారు.

వినియోగంలోకి చెత్త సంపద కేంద్రం

వేంపల్లె : జాతీయ ఉపాధి హామీ పథకం కింద గతంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తెస్తున్నట్లు వేంపల్లె గ్రామ పంచాయతీ ఈఓ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది సంపద కేంద్రం వద్ద పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం డోజర్ ద్వారా చదును చేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ జిల్లా అధికారుల సూచనల మేరకు సంపద కేంద్రం వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించి, ఆ ప్రాంతాన్ని చదును చేశామని తెలిపారు.

14న జాతీయ లోక్ అదాలత్

కమలాపురం : సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లావణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, క్రిమినల్, బ్యాంకు కేసులు ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. రాజీ ధోరణిలో ఉన్న ఇరు వర్గాల కక్షిదారులు ఈ విషయాన్ని గమనించి సెప్టెంబర్ 14వ తేదీన జరిగే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసులను పరిష్కరించుకోవాలని మెజిస్ట్రేట్ తెలిపారు.

తహసీల్దార్‌కు వినతి

ఎర్రగుంట్ల: రేషన్ కార్డులను 8వ ప్రభుత్వ చౌక దుకాణంలోనే యథావిధిగా కొనసాగించాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఎరికలరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం తహసీల్దార్ శోభన్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. యర్రగుంట్ల పట్టణంలోని 17వ వార్డులో 300 రేషన్ కార్డులు 8వ ప్రభుత్వ చౌక దుకాణం పరిధిలో ఉండేవని, ప్రస్తుతం ఈ కార్డులన్నీ 7వ చౌక దుకాణంలోకి మార్చారని, తమ వార్డులో ఉన్న రేషన్ కార్డులను 8వ ప్రభుత్వ చౌక దుకాణంలోకి మార్చాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి



ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సిద్ధయ్య

పులివెందుల టౌన్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా జీవించవచ్చని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక జెండామాను వీధిలో ఆయన పర్యటించారు. అక్కడ ప్రజలతో మంచినీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ, తడిచెత్త, పొడిచెత్తల సేకరణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు పరిశుభ్రత పాటిస్తూ మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. ప్రతి ఇంటికి ఇంటి నంబర్లు విధిగా ఉండేలా సచివాలయ సిబ్బంది చూడాలని పేర్కొన్నారు. అంతేకాకుండా పట్టణంలో అక్రమ కుళ్లాయి కనెక్షన్‌లను గుర్తించి వాటిని రెగ్యులర్ చేయించాలని వార్డు అమెనిటీ సెక్రటరీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారి మునికుమార్, ఆర్ఐ మధుసూధన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలి

సింహాద్రిపురం : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య అన్నారు. మండల పరిధిలోని కోవరంగుట్టపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లోమడ గ్రామంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి ప్రజలకు మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించి మలేరియా వచ్చిన వ్యక్తి గ్రామంలో ఫీవర్, లార్వా సర్వే, దోమల నివారణకు సైఫోనోత్రిన్ పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ ఖలీల్ బాషా, ఎంఎల్‌హెచ్‌పీ రెడ్డెమ్మ, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సాహిత్య సంపదను కాపాడుకుందాం



చదువుల బాబును సన్మానిస్తున్న అధ్యాపక బృందం

కమలాపురం : మాతృభాష గొప్పతనాన్ని మరువరాదని, సాహిత్య సంపదను కాపాడు కోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కేంద్ర సాహిత్య అకాడమీ బాల పురస్కార గ్రహీత డీకే చదువుల బాబు తెలిపారు. బుధవారం స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో కరస్పాండెంట్ రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిడుగు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాష దినోత్సవం నిర్వహించడం అభినందనీయం అన్నారు. కరస్పాండెంట్ రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ అమ్మభాష గొప్పతనాన్ని ఎప్పుడూ మరవరాదన్నారు. మాతృభాషలో ప్రావీణ్యం సంపాదించుకుంటే తర్వాత ఏ భాషనైనా సులభంగా నేర్చుకోవచ్చన్నారు. అనంతరం డీకే చదువుల బాబును సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

జమ్మలమడుగు : బాలికల వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ముద్దనూరు రహదారిలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజి ఆవరణంలోని బాలికల వసతి గృహాలకు టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలుంటే తన దృష్టి తేవాలని సూచించారు. బాలకలు బాగా చదువుకుని ఉన్నత స్థితికి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గోనా పురుషోత్తం రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.